కథానిక

# మారకం

"అవనీంద్ర"

రామం రొప్పుతూ రోజుతూ కూరగాయల బుట్టతో సహా ఇంట్లోకి అడుగు పెట్టి: "పిన్నమ్మా, పిన్నమ్మా. ఇవిగో నువ్వు తీసికో రమ్మన్న కూరగాయలు. వంకాయలు సవాశేరు, బంగాళా దుంపలు సవాశేరు. మొత్తం ఏడణాలన్నర అయింది. ఇదిగో నీ విచ్చిన రూపాయలో మిగిలిన చిల్లర" అని చెప్పి, కామమ్మగారి చేతిలో ఎనిమిదణాలన్నర చిల్లర పెట్టి, కొంచెం విరామంగా ఊపిరి పీల్చుకున్నాడు! కొంతసేపాగి "పిన్నమ్మా ఇక, నేను వెళ్లి ఆటలాడుకుంటానమ్మా. వెళ్ళనా మరి?" అని కొంచెం భయపడుతూ జంకుతూ అడిగాడు.

పిన్నమ్మ కామమ్మ ఏదో వంట పనిలో నిమగ్నురాలై ఉన్నదల్లా తెప్పరిల్లి "ఏవీ, ఆ కూరలు ఇల్లా పడెయ్యి. చచ్చువీ, పుచ్చువీ లేకుండా తెచ్చావా? నిన్నే పనికి పంపించినా అంతంత మాత్రంగానే చేసుకొస్తావు. ఆటలు! ఆటలు! యెప్పుడూ ఒకటే ఆటలు. ఊఁ" అని తను మామూలుగా కుర్రవాణ్ణి విమర్శగా అనే మాటలు నాలుగూ అని, "సరే కాని కొంచెం త్వరగా ప్రొద్దుకూకకముందే రా. రాత్రి తోడేసుకుంటానికి పాలూ, అన్నాయి అన్నంలోకి పెరుగూ తీసికో రావాలి. తెలిసిందా! ఆలస్యంగా వచ్చావా అంటే, ఉండే జాతర!" అని హుంకరించింది.

తొమ్మిదేళ్లు నిండిన రామానికి తల్లీ తండ్రీ పోయిం తరువాత, ఆ పినతల్లీ, పినతల్లి కొడుకు దగ్గర ఉంటూ ఈ ఈసడింపులు తింటం ఒక అలవాటైపోయింది. కొంచెం వినీ విననట్లు కుర్రతనం మూలాన ఊరుకుంటూ, బైటికి వెళ్ళి ఒళ్లు దులుపుకొని తనని కాదన్నట్లు, ఆటల సంబరంలో పడి, తను పడుతున్న అవస్థంతా మరిచిపోతాడు. అల్లాగే ఈ రోజున పినతల్లి చెప్పినదంతా శిరసావహించేటట్లు తల ఊపి, ఒక్క క్షణంలో బైటపడ్డాడు. మరింకో క్షణంలో తోడి పిల్లవాళ్లతో ఆటలలో నిమగ్నుడైపోయాడు.

ఆటల సందడిలో కూడా పినతల్లి చెప్పిన ప్రకారం, ప్రొద్దుకుంకక ముందే ఇంటికి వెళ్ళవలసిన విధిని జ్ఞాపకం ఉంచుకొని టంచనుగా ఆరు గంటలకల్లా పినతల్లి దగ్గర హాజరయ్యాడు.

"ఇదిగో ఈ ఎనిమిదణాల బిళ్ళ. నీ వాలస్యం చేసి వెడితే నీళ్ల పాలు నీళ్ళ పెరుగూ పోస్తారు ఆ ముండాకొడుకులు. ఇప్పటికే ఆలస్యం అయింది. ఊఁ పో..." అని గదిమింది. పాపం రామం ఏమీ మాటాడకుండా మాత్రం అర్థ రూపాయి చేతవేసుకొని సత్తు బుడ్లు రెండూ పుచ్చుకొని ఒక్క పరుగుతీశాడు.

అరగంటైన తరువాత దిక్కుముఖం వేసుకొని, నేరంచేసిన వాడులాగా భయపడుతూ భయపడుతూ ఇంట్లో అడుగుపెట్టాడు. అప్పటికి ఆ పినతల్లి కొడుకు విశ్వం- పదహారు పదిహేడేళ్ళవాడు- తన ఆటలు ముగించుకొని దొడ్లోకొచ్చి కాళ్లు కడుక్కొని, తుండుగుడ్డతో తుడుచుకుంటూ కనిపించాడు రామంకి. రామంకి విశ్వం అన్నా భయమే. ఏ పొరపాటు చేస్తే కొట్టిపోతాడేమోనని ఝడిసిపోతాడు.

"పిన్నమ్మా! తీరా నే వెళ్ళేటప్పటికే మామూలుగా పోసేవాళ్లు లేరు. ఇంకోళ్ల దగ్గరికి వెడితే ఈ అర్ధరూపాయి దొంగ అర్ధ రూపాయట! చెల్లదు పొమ్మన్నారు" అని భయంతో వణుకుతూ చెప్పాడు.

"నాకు తెలవదూ! వెధవా! నువ్వు చేసే పనులన్నీ అంతే. ఈ అర్ధ రూపాయి నువ్వింకాక తెచ్చిందేగా. నే నెక్కణ్ణుంచైనా నీ కోసం దొంగ అర్ధరూపాయి పుట్టించుకో వచ్చాననుకున్నావా. ఇదా నువ్వు చేసుకోవచ్చే పని. గుడ్డివెధవ్వాయేం? ఆ కూరగాయలవాడు చిల్లరిస్తుంటే, నీ కళ్ళెక్కడున్నయ్యంట!" అని

తుపాను లేపింది కామమ్మ. ఇంతలోకే అన్న విశ్వం కూడా అందుకున్నాడు.

“గుడ్డీ కాదు ఏమీ కాదు. గాలు గుడ్డివేషం వెధవవేషాలు వేస్తున్నాడు. ఎక్కడికిపోతాయి తండ్రిగారి దొంగ బుద్ధులు! పాపం పెద్దమ్మ బ్రతికి లేదుగాని వీడి చేష్టలుచూసి హోరున యేడ్చును! దొంగ వెధవ, దొంగ వెధవని. ఎలాగయినా సరే ఆ అర్ధరూపాయి నువ్వు మార్చుకోరావాల్సిందే. లేకపోతే ఉందే జాతర!” అని కసిరికసిరి కొట్టాడు.

కామమ్మకూడా కొడుక్కి తాళంవేస్తూ అవ్వే మాటలు ఇంకా కొంచెం ఒత్తి పలికింది. వాళ్ళిద్దరిముందరా దిక్కులేని రామం బెంబేలు పడ్డాడు.

“అబ్బాయ్ విశ్వం! పాలు కాగపెట్టి ఉంచాను. పాపం ఆడుకొని ఎంత అలిసిపోయి వచ్చావో! మళ్ళా చల్లారిపోతయ్. ఇవ్వి తాగి వెళ్లు నాయనా!” అని వాత్సల్యం ఉట్టిపడేటట్లు అంది. అంటమే తడవుగా విశ్వం తల్లి దగ్గరకొచ్చి కూర్చున్నాడు రామంవైపు మిర్రిమిర్రి చూపులుచూస్తూ. అతడు తాగుతూండగా పాపం రామానికికూడా తాగాలని అనిపించింది. సగం చచ్చి అమాయకంగా అడిగాడు, “పిన్నమ్మా నాకు కాసిన్ని పాలు ఇవ్వవూ? నాకూ తాగాలని ఉంది.

“హుం ఇంకా చేసింది చాలక నీకు పాలూ పెరుగులు కావాలేం. అడగటానికి సిగ్గులేదురా వెధవా? ముందర పాలూ పెరుగూ తెస్తేగాని నీకసలు అన్నంకూడా పెట్టను. ఇదిగో ఇంకో అర్ధరూపాయి. పడన్దికూడా వెంట తీసికో పో. ముందర ఆపడన్ది చూపించి, ఎల్లాగోల్లాగు మార్చి తీసికోరా!” అని నాలుగూపెట్టి, అర్ధరూపాయిచ్చింది. రామంచేసేది లేక బైటకొచ్చి మళ్ళా ఒక్కపరుగు తీశాడు గొల్ల బజారుకి.

* * *

“పిన్నమ్మా! ఆ అర్ధరూపాయి పడలేదు. మంచి అర్ధరూపాయే మార్చాను. ఏడణాలు పోగా ఇదిగో అణా ఇదిగో పడని అర్ధరూపాయి” అని మిగిలిన అణా, పడని అర్ధరూపాయీ కామమ్మ చేతిలో పెట్టాడు.

ఇందాకటి ఆగ్రహం తగ్గింది కామాబోలును, కొంచెం చల్లబడింది. “సరే కాని, ముందర అన్నంతిను తర్వాత ఈ అర్ధరూపాయి మారే ఉపాయం చూడు.” అని వచ్చినవాడికి అన్నంమాత్రం పెట్టింది. విశ్వం అవతల గదిలోనుంచి “అన్నంతిని వెళ్ళి అర్ధరూపాయి మార్చుకో రాకపోయావంటే, నీ చేతులు విరక్కొడతాను గాడిదా” అన్నాడు. రామం ఏమీ మాట్లాడకండా ఆ రెండు అన్నం మెతుకులూ నోట్లోవేసుకొని అర్ధరూపాయి మార్చటానికి బయలుదేరాడు. కాని ఒక సందేహం వేసింది. మరింకో అణాకూడా తీసికొవెడితే, దాన్ని ఆధారంగా చేసుకొని అర్ధరూపాయి మార్చే ఉపాయం చూడవచ్చునని అనుకున్నాడు. “పిన్నమ్మా, ఒక అణాకూడా ఇవ్వవమ్మా ఏదైనాకొని మారదని వాళ్ళంటే అణా కొట్టువాడికివ్వవచ్చు. లేకపోతే వాళ్లు నన్ను కొడతారేమో లేకపోతే పోలీసులకి అప్పజెప్పతారేమోనమ్మా” అని కామమ్మ నడిగాడు. “మళ్ళా అణాకూడా దండగ అయినా ఎందుకైనా మంచిది. తర్వాత నిన్ను వెతికించలేక నేను చావాలి. ఇదిగో తీసికో!” అని అణా ఇచ్చింది.

తొమ్మిదేళ్ళ అమాయకపు రామం ఇక ఆ అర్ధరూపాయి మారే ఉపాయాలకోసం ఆలోచించటం ప్రారంభించాడు. ఆలోచించి ఆలోచించి ఏదో ఉపాయం తట్టినట్లు చురుగ్గా బజారులోకి వచ్చాడు. ఒక పిడతకందిపప్పువాడు గంట వాయించుకుంటూ రోడ్డుపక్కగా చక్రాల బండీని పెట్టుకొని కనిపించాడు. వెంటనే అతని దగ్గరకి వెళ్ళి “ఏమోయ్! ఒక అర్ధణా పిడత కందిపప్పు పెట్టు!” అని పురమాయించాడు. ఇద్దరుముగ్గురు పిల్లలు అవిఘంగానే ఆ పిడత కందిపప్పుతనిదగ్గర నిలబడి ఉన్నారు. ఈ సందడిలో అర్ధరూపాయి చూడవచ్చాడా అని, అతను కట్టి ఇచ్చిన పిడత కందిపప్పు పొట్లం తీసికొని, అర్ధరూపాయి ఇచ్చి ఏమీ ఎరగనట్టు “చిల్లర ఇవ్వవోయ్!” అన్నాడు రామం. అతనూ తక్కువవాడు కాదు. అర్ధరూపాయి చేతిలో పెట్టగానే, కొంచెం దీపం వెలుగులో తేరిపార చూచాడు. “ఏమయ్యోవ్!

కుర్రాయనా, నన్ను మోసం చేద్దామనుకున్నావా ఏం? పడని అర్ధరూపాయి చేతిలో పెట్టావూ, చాల్లే, తీసుకో" అన్నాడు. రామం పచ్చి వెలక్కాయి తిన్నట్లయి చేసేదేంలేక అణా చేతిలో పెట్టాడు. మిగతా అర్ధణా చేతిలో వేయించుకొని మళ్లా కార్యార్థం రోడ్డుమీద పడ్డాడు. చుట్టూ ఉన్న పిల్లలంతా దీనికి పకపక వెక్కిరింతగా నవ్వారు. రామం తల వంచుకొని నడవటం ప్రారంభించాడు.

చాలా దూరం నడిచినడిచి మొదటి దృశ్యం కనపడనంత దూరం వెళ్ళి, కొద్దిసేపు చేసేదిలేక నుంచున్నాడు. ఎదురుగుండా పకోడీల దుకాణం కనిపించింది. మళ్ళా మొండిధైర్యంచేసి గంభీరంగా దగ్గర కెళ్ళాడు. "ఒక అర్ధణా పకోడీలు కట్టివ్వండి" అన్నాడు. దుకాణదారు పొట్లం చేతిలో పెట్టగానే ఏదో అటువైపు చూస్తున్నట్లుగా నటించి, అతడుచాచిన చేతిలో అర్ధరూపాయి బిళ్ళ పెట్టాడు. పెట్టీ పెట్టంగానే

"దొంగ నాణెం ఎవరికి కావాలయ్యా? మోసం చేద్దామనుకున్నావా?" అని దుకాణదారు రామాన్ని కసిరాడు.

"ఆఁ ఏమిటీ దొంగ నాణెమా! అసలే నాకు తెలియదే! నన్నూ ఎవడో మోసం చేశాడన్న మాట!" అని ఇంకేదో రామం చెప్పబోతుండగా "అర్ధణా ఇవ్వవయ్యా! నీతో కబుర్లేసుకుంటే, నా వర్తకం సాగదు. ఊఁ" అని ఝుమాయించి అడిగాడు దుకాణదారు.

తన చేతిలో మిగిలి ఉన్న ఒకే ఒక అర్ధణా బిళ్ళ అతని చేతిలో పెట్టి చేసేదేమీలేక బయలుదేరాడు. ఇక ఏం చేసేది? పిన్నమ్మ యిచ్చిన అణాకూడా దండగ అయింది. ఇక ఎవరి దగ్గరకి వెళ్ళి అడగాలి?" అని కార్యాంతరం కోసం ఆలోచించటం ప్రారంభించాడు. ఏదైనా అడిగి డబ్బివ్వటానికి కూడా ఇక వైకం లేదు. ఇక పోతే ఆ దుకాణదారుచేత తన్నులు తినటమో ఏదో హంగామా జరగాల్సిందే. ఈ సారి కుర్రాడిక ప్రమాదానికి లోనుకావటానికి భయపడ్డాడు. పిన్నమ్మ దగ్గరకి వెళ్లి తన ఓటమినే తెలియబర్చుకోవాలి. చేసేదేంలేదని తలగోక్కుని దారిన పడ్డాడు. అప్పటికే కొట్లన్నీ కట్టేసే వేళయింది. రాత్రి ఎనిమిది గంటలు కూడా దాటొస్తోంది. పెద్ద బజారంతా మాటుమణుగుతోంది. ఇంతవరకూ తను తినుబండారాల దుకాణాల్లోనే ప్రయత్నించాడు. "మరింకే ఇతర రకమైన కొట్లలోనైనా ప్రయత్నిస్తే" అని తోచింది రామానికి.

పెద్ద బజారుదాటి రెండో రోడ్డు మలుపులోకి వచ్చాడు. లైట్ల వెలుగులు దాటినమీద, ఆమలుపులో దీపం వెలుగు లేకపోవటం మూలాన చిమ్మన చీకటిగా ఉంది. ఇంటికి పోతే అన్న విశ్వం, చెయ్యి విరగకొట్టే తీరుతాడు. పినమ్మ పట్టినన్ని తన్నులూ తన్నుతుంది. మళ్ళా ఈ కాబోయే దృశ్యం పోల్చుకుంటేటప్పటికే ఏమైనాసరే మరో గట్టిప్రయత్నం చేసి గెలిచి తీరాలి ఈసారి, అని మళ్ళా దృఢనిశ్చయం చేసుకొని అటూ ఇటూ కలయజూచాడు. కొద్ది దూరంలో ఒక కిళ్ళీ కొట్టు కనిపించింది. చూడబోతే ఎవరో చిన్న కుర్రాడు కొట్లో కూర్చొని ఉన్నట్లుగా ఉంది. తన చిన్న బుర్రకి ఆ కుర్రాణ్ణి మరిపించవచ్చని తోచింది. మహా గాంభీర్యంగా వెళ్ళి "రెండు కిళ్ళీలు కట్టి, ఈ అర్ధరూపాయి చిల్లరివ్వవోయ్" అని డాబుగా ఆ అర్ధరూపాయి కుర్రవాడి చేతిలో వేశాడు. ఆ కుర్రాడు తండ్రి ఆజ్ఞమీద కిళ్ళీలమ్ముతూ క్లాసు పుస్తకంలో పాఠం వల్లెవేస్తున్నవాడల్లా రామం ఆజ్ఞ శిరసావహించే నిమిత్తం ఆ అర్ధరూపాయి చేతిలో పెట్టంగానే దాన్ని గల్లా పెట్టెలో వేసి, గబగబా రెండు కిళ్ళీలు కట్టి, మిగతా ఏడణాలూ కిళ్ళీలూ చేతిలో పెట్టి దీర్ఘాధ్యయనంలో పడ్డాడు.

రామంకు విజయగర్వం కల్గినా మోసం చేశావే అని మళ్ళా అనిపించినా ఇక అక్కడ ఆగితే ఆ కిళ్ళీ కొట్టు కుర్రాడు అనుమానపడి, తన బండారం ఎక్కడ బైట పెడతాడోననే భయంతో చకచకా ఒక్క నిమిషంలో కొట్టు దాటి, చీకటి రోడ్డుమీదకి వచ్చి, మలుపు తిరిగి పెద్ద బజారుమీదపడ్డాడు.

ఇంటిదగ్గర కామమ్మ, విశ్వం రామంకోసం ఒళ్ళంతా కళ్ళు చేసుకొని ఎదురుచూస్తూ కూర్చున్నవాళ్లు రామం కంటబడంగానే,

"ఏం? ఇంత సేపు ఏం వెలగబెడుతున్నావ్?

తీరా ఇంతా చేస్తే ఆ అర్థరూపాయి మార్చావా లేదా?" అని దులపరించి అడిగారు.

"ఆఁ మారింది పిన్నమ్మా. కాని నువ్విచ్చిన ఒకణా ఖర్చుకాగా, మరింకో అణా ఖర్చు పెడితేగాని. అర్థరూపాయి మారకం కాలేదు. ఒక అణాతో రెండు కిళ్ళీలు కొనుక్కొ వచ్చాను" అని భయపడుతూ చెప్పాడు. విశ్వం రామం చేతుల్లో కిళ్ళీలు చూచీ చూడంగానే "భలే కిళ్ళీలు తెచ్చావు" అని రామం చేతుల్లోంచి, కిళ్ళీలు లాక్కొని, ఆ రెండూ నోరు పట్టకపోయినా కుక్కుకున్నాడు.

"అయితే మిగతా అణా నీ చిరుతిండికి తగలేశావన్న మాట!" అని రామం ఇచ్చిన చిల్లర లెక్క బెట్టుకుంటూ కామమ్మ గునిసింది. రామం మారు మాట్లాడకండా పడుకోటానికి పక్క దగ్గిరకి వెళ్ళాడు. పడుకున్నాడే కాని అతని మనస్సులో ఒకింత బాధ కలిగింది.

"పాపం ఆ ఖిల్లీకొట్టు కుర్రాడు తండ్రి కేకలేస్తే ఆపడని అర్థరూపాయికి ఏమని సమాధానం చెప్పుకుంటాడు?" అని ఇల్లా ఆలోచిస్తూ పడుకోకండగానే కళ్లు మూతలుపడ్డయ్. కొంచెంసేపట్లోనే నిద్రాదేవత "ఆ కుర్రాడి సమస్యకోసం నీ చిన్నబుర్రని ఎందుకు పాడు చేసుకుంటూ"వన్నట్లు రామాన్ని జోకొట్టింది

# క్షణంలో సగం

"శారద"

అజ్ఞాని జ్ఞానిని కలుసుకుని "అయ్యా, చేతి మీద బల్లిపడింది!" అన్నాడు. ఫలితం ఏమిటో? అన్నట్లు ధ్వనించి.

జ్ఞాని "లాభం" అన్నాడు పంచాగం కంఠస్థం అయినందువల్ల కాబోలు.

ఆ లాభం ఎంతకీ సిద్ధించకపోయేసరికి అజ్ఞానికి దిగులేసింది. ఆ దిగులు చూసి, తన పలుకుబడికి మోసం రాగల ప్రమాదం తప్పించుకుందికి ఆ జ్ఞాని విజ్ఞాని పోజ్ వేసి, "ఆ బల్లి తేలు కాకపోవటమే లాభం" అని తేల్చేడు. అజ్ఞాని ఆలోచనలో పడ్డాడు.

* * *

ఆగస్టు 15 తేదీ సందర్భాన ఎలక్షన్‌లో పోటీ చెయ్యదల్చిన పక్షాలన్నీ గూడా తాము "ప్రజ" తరఫునే నిలబడి "ప్రజల కోసమే" ఎలక్షనులో దిగామని ప్రతిజ్ఞ చెయ్యావలసిందిగా మేధావులందరూ ఉద్ఘోషించడంవల్ల "ప్రజ"కి చాలా దిగులుగావుండి తనకీ ఎలక్షనుకీ ఏదైనా సంబంధం వుండగలదా అని పరిశీలిస్తున్నది.

* * *

దేశంలో గాంధిగారు, నేతాజీ అస్తమించాక, అప్పుడప్పుడు వెలసిన వారివారి విగ్రహాలన్నీ మొన్న ఓ మహాసభ చేసి "ఆత్మహత్య" చేసుకుందికి తీర్మానించుకున్నట్టు స్వకీయ విలేఖరి గాలివార్త పంపించాడు. కారణం ఏమని విచారించగా, రోడ్ల జంక్షనులలోనూ, పార్కులలోనూ, భవనాల ముందు వెలసిన ఈ విగ్రహాల సంఖ్య వేలల్లో వున్నప్పటికీ, వీటిల్లో ఒకదాని పోలిక మరొకదానికి లేకపోవటమూ, అసలు కొన్ని విగ్రహాలకీ, ఆ నాయకునికీ ఎక్కడా సంబంధం వుండకపోవటమూనట. అందులోనూ విశేషంఏమిటంటే ఒకే సిమెంటు కర్మాగారంలో తయారైన గాంధీగారి విగ్రహాలలోనే పోలికలు లేకపోవటమట.

ప్రభుత్వం రేషన్ పెంచడంలోనూ, తగ్గించటంలోనూ, 'అకస్మాత్తు' మార్పులేవీ చెయ్యటంలేదనీ, ధరల విషయంగూడా అంతేననీ, సంవత్సరం మొదట్లోనే వీటి విషయమై 'ఓ ప్లాను' ఉంటుందనీ, ఆ ప్లాను ప్రకారమే ప్రభుత్వం నడుస్తోందనీ, ఈ ప్లాన్ను 'రేషన్ ఎక్కం' అని పిలుస్తారనీ, మదరాసులో అనధికారవర్గాలవాళ్లు (ఎవళ్లో?) అనుకుంటున్నారు. ఈ రేషన్ ఎక్కాల పుస్తకం వెంకట్రామా అండ్ కోలో దొరకదని తెలుస్తున్నది.

51 ఆగస్టు 15వ తేదీలోగా "ఆంధ్రరాష్ట్రం" వచ్చేటట్టయితే ఆ జన్మాంత ఉపవాసం పూని మరణిస్తానని ఒక ఉత్తరాదిస్వామి ప్రతిజ్ఞను పూనడంవల్ల అలాంటి దేమీ సంభవించదని కేంద్రంనుండి హామీ వచ్చిందన్న వార్త నిరాధారమని తెలుస్తున్నది.